హైదరాబాద్
8-10-2023
సంపుటి:08
సంచిక: 363
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# రాకెట్ల రణం

## హమాస్ - ఇజ్రాయెల్ మధ్య మళ్లీ యుద్ధం

- 7 వేల రాకెట్లు ప్రయోగించిన ఉగ్ర సంస్థ
- ఇజ్రాయెల్ ప్రతిదాడి
- రాకెట్ల వరద.. నెత్తుటి ప్రవాహం
- ఇరువైపులా 400 మంది పైగా మృతి!
- 2 వేల మందికి పైగా క్షతగాత్రులు
- యుద్ధంలో ఉన్నాం: ప్రధాని నెతాన్యాహు
- ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం: మోదీ
- ఇళ్ల నుంచి వీడొద్దని భారతీయులకు సలహా
- ఇజ్రాయెల్‌కు బాసటగా ప్రపంచ దేశాలు

ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య భీకర యుద్ధం మొదలైంది. శనివారం ఉదయం నుంచి రాకెట్ల రణం.. నెత్తుటి ప్రవాహం కొనసాగింది. పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హరాకత్ అల్-ముక్వామా అల్-ఇస్లామియా(హమాస్) శనివారం ఉదయం 'ఆపరేషన్ అల్-అక్సా స్ట్రామ్' పేరుతో ఇజ్రాయెల్‌పై సుమారు 7 వేల రాకెట్లతో ముప్పేట దాడి జరిపింది.

మిగతా 2లో





## ముగిసిన సీఎం జగన్ ఢిల్లీ పర్యటన

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. గురువారం ఉదయం ఢిల్లీకి వెళ్లిన ఆయన.. ఈ ఉదయం ఢిల్లీ నుంచి ఏపీకి తిరుగుపయనం అయ్యారు. శుక్రవారం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో హాజరు కావడంతో పాటు.. పలువురు కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి సంబంధించిన వ్యవహారాలపై చర్చలు జరిపారాయన. ఏపీకి రావాల్సిన నిధులు, బకాయిలతో పాటు పోలవరం.. వివిధ అంశాలను సీఎం జగన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కేం?ద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో, ఆపై కేంద్రం విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో భేటీ అయ్యారాయన. ఈ సందర్భంలో.. ఏపీ విద్యుత్ రంగ అభివృద్ధిపై మంత్రి ఆర్కే సింగ్ ప్రశంసలు గుప్పించారు. ఆపై నిన్న(శుక్రవారం) ఢిల్లీలో వామపక్ష తీవ్రవాద నిర్మూలన సదస్సులో.. ఏపీ నుంచి సీఎం జగన్, సీఎస్, డీజీపీ

మిగతా 2లో

# రేవంత్ కాదు.. రేటెంతరెడ్డి



- కామారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్
- ఆయన ఆర్ఎస్ఎస్ మనిషి.. ఎన్నికల తర్వాత బీజేపీలో చేరడం ఖాయం: మంత్రి కేటీఆర్
- కామారెడ్డిలో కేసీఆర్‌కు రికార్డు మెజారిటీ అందించాలి
- మన హ్యాట్రిక్ కోసం మహారాష్ట్ర ఎదురుచూస్తోంది
- అక్కడా గులాబీ జెండా ఎగురవేద్దాం
- కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తాం

కామారెడ్డి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అని, ఆయన ఎన్నికల తర్వాత పది పన్నెండు మంది ఎమ్మెల్యేలతో కలసి బీజేపీలో చేరడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. "ఓటుకు కోట్లు కేసులో అరెస్టైన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సీటుకు రేటు కడుతున్నాడు. అందుకే వాళ్ల పార్టీ నేతలే ఆయనను రేటెంతరెడ్డి అంటున్నారు.." అని విమర్శించారు. శనివారం కేటీఆర్ కామారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఇక్కడి డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగిన కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్య కర్తల సమావేశంలో మాట్లాడారు. దక్షిణ భారత దేశం నుంచి వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రి ఎవరూ కాలేదని.. సీఎం కేసీఆర్ మాత్రం ఈసారితో కచ్చితంగా

మిగతా 2లో



# జయహో భారత్ 107

- ఆసియా క్రీడల్లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన నమోదు
- తొలిసారి 'సెంచరీ'ని దాటిన భారత క్రీడా బృందం
- 107 పతకాలతో నాలుగో స్థానం
- శనివారం 12 పతకాలు గెలిచిన భారత క్రీడాకారులు
- ఆర్చరీలో జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్‌లకు పసిడి పతకాలు
- బ్యాడ్మింటన్‌లో తొలిసారి స్వర్ణం.. కబడ్డీలోభారత జట్ల 'పసిడి కూత'
- క్రికెట్‌లోనూ బంగారు పతకం

మిగతా 7లో



# బీఆర్ఎస్ సెంచరీ.. కేసీఆర్ హ్యాట్రిక్

- బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రనౌట్
- హంగ్ కాదు.. బీఆర్ఎస్‌దే ముమ్మాటికీ హ్యాట్రిక్
- ముఖ్యమంత్రి కేసీఆర్ అంటే నమ్మకం, విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీ అంటే నయవంచన, నాటకం
- మాటలు, మూటలు, మంటలు.. కాంగ్రెస్ కల్చర్
- కాంగ్రెస్ భస్మాసుర 'హస్తం'.. నమ్మితే ఆగమైతం
- రేవంత్‌రెడ్డి మారని పార్టీ అంటూ ఏదైనా ఉన్నదా?
- హస్తం పార్టీ పాలనపై చర్చ పెట్టే దమ్ము ఉన్నదా?
- నడ్డా.. ఈసారి బీజేపీకి ఒక్క సీటు కూడా రాదు

మంచిర్యాల/సంగారెడ్డి: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయమని,

మిగతా 2లో

# ఏపీకి 45, తెలంగాణకు 35

- నీటి కేటాయింపులు చేయాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు
- శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు రాష్ట్రానికి
- మే వరకూ తాగునీటి అవసరాలకు వాడుకోవాలని నిర్ణయం
- నేడు సాగర్ కుడి కాలువ కింద తాగునీటి అవసరాలకు నీటి విడుదల

అమరావతి : ప్రస్తుత నీటి సంవత్సరంలో మే వరకూ తాగునీటి అవసరాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న నీటిలో ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. ఏపీకి కేటాయించే నీటిలో శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15

మిగతా 2లో




# హంగొస్తే బీజేపీ, బీఆర్ఎస్ చేతులు కలుపుతాయి

- ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధం
- కేసీఆర్ పక్కాగా ప్రధాని మోదీ ఏజెంట్
- ఒవైసీ.. సోనియాను తిడితే భారీ మూల్యం
- కాంగ్రెస్ వచ్చాక క్రైస్తవ సంక్షేమ బోర్డు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- తెలంగాణ అభివృద్ధి ఒక ఇంటిలోనే..
- మత స్వేచ్ఛను అణచివేస్తున్న మోదీ
- భయంలో మైనారిటీలు: పి.చిదంబరం

మిగతా 2లో

# రేవంత్ కాదు.. రేటెంతరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

హ్యాట్రిక్ సాధిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. దేశమంతటా తెలంగాణ గురించే చర్చ నడుస్తోందని, ఇక్కడ బీఆర్ఎస్ విజయం కోసం మహారాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆ రాష్ట్రంలో చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, జెడ్పీ మెంబర్లు బీఆర్ఎస్‌తో కలసి రావడానికి సిద్ధంగా ఉన్నారని.. తెలంగాణలో గెలి చాక మహారాష్ట్రలోనూ గులాబీ జెండా ఎగుర వేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహా రాష్ట్రలో సాధించే విజయంతో కేంద్రంలో కీలక భూమిక పోషిస్తామని పేర్కొన్నారు.

**దేశ రాజకీయాలకు దిక్సూచిగా..**

సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా సంచలనమే నని కేటీఆర్ చెప్పారు. "మొదట సిద్దిపేటలో పోటీ చేసిన ఆయన టీఆర్ఎస్‌ను స్థాపించారు. కరీంనగర్‌లో పోటీచేసి ఢిల్లీకి తెలంగాణవాదాన్ని తీసుకువెళ్లారు. మహబూబ్‌నగర్‌లో పోటీ చేసి దేశాన్ని ఒప్పించి రాష్ట్రం సాధించారు. గజ్వేల్‌లో పోటీచేసి ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దారు. పదేళ్ల స్వల్పకాలంలోనే వందేళ్ల ప్రగతి సాధించారు. కామారెడ్డిలో భారీ మెజారిటీతో విజయం ద్వారా హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సాధించి, దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలుస్తారు.." అని పేర్కొన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగానే కాంగ్రెస్, బీజేపీల నాయకులు వణికిపోయి పోటీచేయడంకన్నా ఇంట్లో పడుకోవడమే మంచిదనే భావనతో ఉన్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను దేశంలోనే అఖండ మెజారిటీతో గెలిపించడం ద్వారా సరికొత్త చరిత్ర లిఖించాలని పిలుపునిచ్చారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ వాళ్లకు అడ్డగోలుగా డబ్బులు వస్తాయని, అదానీ నుంచి బీజేపీ వాళ్లకు డబ్బులు వస్తున్నాయని.. బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. రకరకాల సమీకరణాల దృష్ట్యా టికెట్ల కేటాయింపులో ముదిరాజ్‌లు, మరికొన్ని కులాలకు అవకాశం దక్కలేదని.. అయితే వారికి ఎమ్మెల్సీలుగా, చైర్మన్లుగా అవకాశం ఇస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ పోటీచేసే కామారెడ్డి నియోజకవర్గంలోని గ్రామాల వారీగా, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రత్యేక మేనిఫెస్టోలు రూపొందించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

# ఏపీకి 45, తెలంగాణకు 35

(మొదటి పేజీ తరువాయి)

టీఎంసీలు విడుదల చేయాలని సూచించింది. అలాగే, తెలంగాణకు రెండు ప్రాజెక్టుల నుంచి 35 టీఎంసీలు విడుదల చేయాలని చెప్పింది.జూన్–ఐజూలైలలో తాగునీటి అవసరాల కోసం ఉమ్మడి ప్రాజెక్టుల్లో 2.788 టీఎంసీలను నిల్వచేయాలని తీర్మానిస్తూ కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు త్రిసభ్య కమిటీ ప్రతిపాదనలను శుక్రవారం రాత్రి పంపింది. వీటి ఆధారంగా నీటి కేటాయింపులు, విడుదల ఉత్తర్వులను కృష్ణా బోర్డు చైర్మన్ జారీచేయనున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా నదిలో లభ్యత, ఇప్పటిదాకా వినియోగం, మే వరకూ తాగునీటి అవసరాలపై చర్చించడమే అజెండాగా హైదరాబాద్‌లో కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌లు సభ్యులుగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. రెండు దఫాలుగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశం వాడివేడిగా సాగింది.

**ఇప్పటివరకు ఏపీ, తెలంగాణ 144 టీఎంసీల వినియోగం..**

ప్రస్తుత నీటి సంవత్సరంలో సెప్టెంబరు 30 వరకూ ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ నుంచి 4.210, శ్రీశైలం నుంచి 25.865, ఇతర ప్రాజెక్టుల నుంచి 65.649 మొత్తం 95.724 టీఎంసీలను వాడుకుందని తేల్చింది. అదే తెలంగాణ రాష్ట్రం నాగార్జునసాగర్ నుంచి 11.88, శ్రీశైలం నుంచి 12.626, ఇతర ప్రాజెక్టుల నుంచి 24.037 మొత్తం 48.543 టీఎంసీలు వాడుకుంది. రెండు రాష్ట్రాలు కలిసి ఇప్పటిదాకా 144.267 టీఎంసీలు వినియోగించుకున్నాయి. దీంతో సెప్టెంబరు 30 నాటికి సాగర్ కనీస నీటిమట్టానికి ఎగువన 27.532, శ్రీశైలంలో కనీస నీటిమట్టానికి ఎగువన 55.256 టీఎంసీలు వెరసి 82.788 టీఎంసీలు లభ్యతగా ఉన్నట్లు తేల్చింది. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసమే నీటిని వాడుకోవాలని బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే చేసిన సూచనకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు అంగీకరించారు.

**అలా అయితేనే చెన్నైకి నీరు..**

కానీ, నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ వాటా నీటిని విడుదల చేస్తేనే.. చెన్నైకి నీటిని సరఫరా చేయగలమని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి స్పష్టంచేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో తమ వాటా ఇవ్వలేమని తెలంగాణ ఈఎన్‌సీ తేల్చిచెప్పారు. ఇలాగైతే చెన్నైకి నీటిని విడుదల చేయలేమని ఏపీ ఈఎన్‌సీ కూడా తెగేసిచెప్పారు. దీనిపై సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే స్పందిస్తూ.. కేంద్ర జల్‌శక్తి శాఖతో సంప్రదింపులు జరిపి ఎగువ రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటకలు వాటా నీటిని విడుదల చేసేలా చూస్తామన్నారు. ఎగువ రాష్ట్రాలు వాటా నీటిని విడుదల చేస్తే చెన్నైకి నీటిని సరఫరా చేయడానికి తమకెలాంటి అభ్యంతరంలేదని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి చెప్పారు.

**నేడు సాగర్ కుడి కాలువకు నీళ్లు**

నీటి కేటాయింపులపై బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సులు చేసిన నేపథ్యంలో నాగార్జునసాగర్ కుడి కాలువ కింద తాగునీటి అవసరాల కోసం శనివారం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నీటిని విడుదల చేయనున్నారు.

# రాకెట్ల రణం

జెరూసలేం, ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య భీకర యుద్ధం మొదలైంది. శనివారం ఉదయం నుంచి రాకెట్ల రణం.. నెత్తుటి ప్రవాహం కొనసాగింది. పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హరాకత్ అల్–ముక్వామా అల్–ఇస్లామియా(హమాస్) శనివారం ఉదయం 'ఆపరేషన్ అల్–అక్సా స్ట్రామ్' పేరుతో ఇజ్రాయెల్‌పై సుమారు 7 వేల రాకెట్లతో ముప్పేట దాడి జరిపింది. ఇజ్రాయెల్ కూడా అందుకు దీటుగా 'ఆపరేషన్ స్వార్డ్స్ ఆఫ్ ఐరన్' పేరుతో రక్తపుటేరులను పారించింది. గాజాపై బాంబుల వర్షం కురిపించింది. దొరికిన హమాస్ ఉగ్రవాదులను దొరికినట్లు ఊచకోత కోసింది. ఇజ్రాయెల్ పౌరులు యూదుల పర్వదినాలైన సిమ్చాట్ టోరా, యోమ్‌కిప్పుర్, హిబ్రూ షబ్బత్ వేడుకల్లో మునిగి ఉండగా.. హమాస్ ఉగ్రవాదులు ఒక్కసారిగా రాకెట్లతో విరుచుకుపడ్డారు. శనివారం ఉదయం 6.30 గంటలకు సముద్రమార్గం, గగనతలంతోపాటు.. సరిహద్దుల్లోని ఫెన్సింగ్‌ను ఎక్స్‌కవేటర్లతో కూల్చివేసి.. ఇజ్రాయెల్‌లోకి చొచ్చుకువచ్చారు.

# బీఆర్ఎస్ సెంచరీ.. కేసీఆర్ హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేది హంగ్‌లు.. గింగులు కాదని.. కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. బీజేపీకి ఈసారి ఒక్క సీటుకూడా రాదని అన్నారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. కేసీఆర్ అంటే ఒక విశ్వాసం.. కాంగ్రెస్ అంటే నయవంచన.. నాటకం అని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 'ఓడ దాటేదాక ఓడ మల్లప్ప.. ఓడ దాటినంక బోడ మల్లప్ప' అనే రకం అని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా దొనబండ బహిరంగ సభ, చెన్నూర్ అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. ఝురాసంగం, జహీరాబాద్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇవాళ కల్లబొల్లి మాటలు చెప్పి.. అరచేతిలో వైకుంఠం చూపించి.. కర్ణాటక నుంచి డబ్బు సంచులు తెచ్చి ఈ రాష్ట్రంలో గెలువాలని పగటి కలలు కంటున్నదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణలో కాంగ్రెస్ నాటకాలు నడువవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు గ్రూప్‌లు, ముఠా రాజకీయాలతో వాళ్లలో వారే తన్నుకొని పరిపాలనను భ్రష్టు పట్టించారని గుర్తుచేశారు. అధికారం కోసం తమ సొంత పార్టీ ముఖ్యమంత్రులను కుర్చీలోంచి దించి.. ఇంకొకరు కుర్చీ ఎక్కడం కోసం హైదరాబాద్‌లో మతకలాహాలు సృష్టించి, కర్ఫ్యూలు పెట్టిన పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. ఇవాళ కేసీఆర్ హయాం లో కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినంక కరువు లేదని, తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ కాలంలో కర్ఫ్యూ అంతకంటే లేదని తెలిపారు.

చెప్పినవన్నీ చేసిచూపిన కేసీఆర్

కాంగ్రెస్ పార్టీ ఆ రోజు నక్సలైట్లతో చర్చలు అని చెప్పి, ఆ నక్సలైట్లను మట్టు పెట్టింది వాస్తవం కాదా? అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ పార్టీ ఏ విషయంలో మాట మీద ఉన్నదో చెప్పాలని ప్రశ్నించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే 6 కిలోల బియ్యం, పగటి పూట కరెంట్, తండాలు గ్రామ పంచాయతీలు చేస్తామని మోసం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక భస్మాసుర హస్తమని, దాన్ని నమ్మితే ఆగమైతమని అన్నారు. కానీ కేసీఆర్ చెప్పిందల్లా చేసి చూపారని చెప్పారు. తెలంగాణ తెస్తా అని తెచ్చి చూపించారని, రైతుబంధు, ఉచిత కరెంట్ ఇస్తా అని చెప్పి ఇచ్చి మాట నిలబెట్టుకొన్నారని తెలిపారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఉచిత కరెంట్ అంటే ఉత్త కరెంట్ చేసిందని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎరువుల బస్తాలు కావాలంటే పోలీస్‌స్టేషన్ల ముందు లైన్లలో నిల్చొండే దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. మళ్లీ కాంగ్రెసోళ్లు వస్తే కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, పగటిపూట కరెంట్, ఎరువు బస్తాలకు కొరత.. ఇలా అన్నింటికీ గోసపడాల్సిందేనని చెప్పారు. ఆనాటి పదేండ్ల కాంగ్రెస్ పాలనకు, ఈనాటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు అసలు పొంతన ఉన్నదా? అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.

# హంగొస్తే బీజేపీ, బీఆర్ఎస్ చేతులు కలుపుతాయి

హైదరాబాద్: "రాష్ట్రంలో హంగ్ వస్తుందని, బీజేపీ మద్దతుతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేత బీఎల్ సంతోష్ అన్నారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ ఎప్పటికీ ఒకటి కావు. ఈ విషయం అందరికీ తెలుసు. అంటే.. హంగ్ వస్తే కలవబోయేది బీఆర్ఎస్, బీజేపీయేనని బీఎల్ సంతోష్ చెప్పకనే చెప్పారు" అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హంగ్ వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీజేపీ తప్పకుండా భాగస్వామి అవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా చూసేందుకు ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ గెలిచే పరిస్థితి లేకున్నా మోదీ తిరుగుతున్నాడని, బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి కుట్రలకు పడిపోకుండా క్రైస్తవులు, ఇతర మైనారిటీలు కర్ణాటక మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. శనివారం సికింద్రాబాద్‌లో జరిగిన క్రైస్తవుల సమావేశంలో కాంగ్రెస్ ముఖ్యనేత చిదంబరంతో పాటు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సదర్భంగా రేవంత్ మాట్లాడుతూ, కర్ణాటకలో జేడీఎస్ పాత్రను తెలంగాణలో బీజేపీ పోషించాలని ఆశిస్తోందని అన్నారు. ప్రజలు తాము ఎన్నుకున్న ప్రభుత్వంలోనే భయంభయంగా బతికే పరిస్థితి దేశంలో, రాష్ట్రంలో ఏర్పడిందని రేవంత్‌రెడ్డి అన్నారు. తాము అధికారానికి వస్తే క్రైస్తవ సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కర్ణాటక మైనారిటీల్లో 88 శాతం ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు నిలబడ్డారని రేవంత్ ప్రస్తావించారు. దాంతో ఆ రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమం కోరే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం కలిగిందన్నారు. తెలంగాణలోనూ మైనారిటీలు కాంగ్రెసకు 90 శాతం అండగా నిలవాలని కోరారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ సోనియాను దూషిస్తున్నారని, మరోపక్క బీజేపీ కూడా కాంగ్రెసనే నిందిస్తోందని రేవంత్ ప్రస్తావించారు. బీజేపీ, బీఆర్ఎసలది ఫెవికాల్ బంధమని వ్యాఖ్యానించారు. వీళ్లిద్దరు సరే ఎంఐఎం కాంగ్రెసను ఎందుకు విమర్శిస్తోందో చెప్పాలని రేవంత్ ప్రశ్నించారు. సోనియాగాంధీ పదవులు త్యాగం చేసినందుకా? దళితుడిని జాతీయ అధ్యక్షుడిని చేసినందుకా? అని నిలదీశారు. దళిత మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్‌మీట్‌లో కూర్చుంటేనే కేసీఆర్ సహించలేదని ప్రస్తావించారు.

మాదిగ వర్గానికి మంత్రివర్గంలో అసలు స్థానమే లేదని వ్యాఖ్యానించారు. దళితులకు, మైనార్టీలకు బీజేపీలోనూ గౌరవం లేదన్నారు. తనను తిట్టినా, పార్టీని తిట్టినా సహిస్తానని, సోనియాగాంధీని తిడితే మాత్రం ఒవైసీ సోదరులు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సోనియాను విమర్శించే నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తెలంగాణ ఎన్నికలు దేశ రాజకీయాలను మలుపు తిప్పే ఎన్నికలని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కేసీఆర్ మోదీకి ఏజెంటని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని రేవంత్ పిలుపునిచ్చారు. డిసెంబరు నెలలో అద్భుతాలు జరుగుతాయని, 2009లో డిసెంబరు 9నే తెలంగాణ ప్రకటన వచ్చిందని, తాజాగా డిసెంబరులోనే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడి పిల్లలకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో అల్పాహార పథకం ప్రారంభించిన అధికారపక్షం ముందు మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు పరిష్కరించాలని రేవంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సక్రమంగా బిల్లుల చెల్లింపులు జరగట్లేదని, పాఠశాలల్లో వంటకు సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచడం లేదని చెప్పారు. మెనూలో మార్పులు చేస్తూ వంట కార్మికులకు ఆర్థిక భారం పెంచుతున్నారని వ్యాఖ్యానించారు. చెట్ల కింద వంటలతో భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యపై సీఎం వెంటనే సమీక్ష జరపాలన్నారు.

**ప్రమాదంలో ప్రజాస్వామ్యం**

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ ముఖ్యనేత చిదంబరం అన్నారు. మీడియా మొదలుకొని అన్ని రంగాలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మతపరమైన స్వేచ్ఛ అణచివేతకు గురవుతోందన్నారు. మైనార్టీలు భయంతో బతుకుతున్నారని వ్యాఖ్యానించారు. పౌర హక్కులకు ప్రజాస్వామ్యం కవచం లాంటిదని, దాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దేవుడికి తప్ప ఎవ్వరికీ భయపడొద్దని, హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోట్లాడాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే తెలంగాణ ఎన్నో రెట్ల అభివృద్ధి జరిగి ఉండేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు కేవలం ఒక కుటుంబానికి పరిమితం అయ్యిందని చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశం అనంతరం జరిగిన కాంగ్రెస్ నిర్వహించిన సభకు యువకులే ఎక్కువ మంది హాజరయ్యారని, రాష్ట్రంలో మార్పునకు ఇదే సంకేతమని చెప్పారు. దేశంలో ఉన్నత చదువులు చదివిన వారికి కూడా 40 శాతం మందికి ఉద్యోగాలు లేవని చిదంబరం ప్రస్తావించారు.

# ముగిసిన సీఎం జగన్ ఢిల్లీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు.నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై రాష్ట్రాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న కేంద్రం.. అక్కడ అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టేందుకు రాష్ట్రాలకు పలు సూచనలు చేసింది. ఈ సదస్సులో సీఎం జగన్ సైతం ప్రసంగించారు.ఈ సదస్సు తర్వాత నిన్న సాయంత్రం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో దాదాపు దాదాపు గంటపాటు సమావేశం అయ్యారు సీఎం జగన్. ఏపీకి రావాల్సిన నిధులు, బకాయిలతో పాటు వివిధ అంశాలపై వారు చర్చించినట్లుగా తెలుస్తోంది.

# అదీ అసలు సంగతి!

(మొదటి పేజీ తరువాయి)

కసులు పెట్టి అరెస్టులు చేస్తే... ఎవరైనా నిర్ణయాలు తీసుకోగలరా? ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో జగన్ సర్కారు చేస్తున్న తతంగం ఫక్తు రాజకీయ కక్ష సాధింపు కాదా? ఇలాంటి పరిస్థితిని నివారించేందుకే అవినీతి నిరోధక చట్టాన్ని సవరించారు. 17ఏ సెక్షన్‌ను చేర్చారు. దీనిప్రకారం... 'పబ్లిక్ సర్వెంట్స్' తమ విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై కేసులు పెట్టి దర్యాప్తు చేయాలంటే... సంబంధిత 'అథారిటీ' అనుమతి తీసుకోవాలి. చంద్రబాబు విషయంలో గవర్నర్ అనుమతి తప్పనిసరి! కానీ... గవర్నర్ అనుమతి లేకుండానే చంద్రబాబుపై ఆగమేఘాల మీద కేసుపెట్టడం, ఆయనను రిమాండ్‌కు తరలించడం జరిగిపోయింది. దీనిపైనే ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు వరకు హోరాహోరీ వాదనలు సాగుతున్నాయి. చంద్రబాబుపై కేసు నమోదుకు గవర్నర్ అనుమతి తప్పనిసరి అని ఆయన తరఫు న్యాయవాదులు... అక్కర్లేదని ప్రభుత్వ న్యాయవాదులు వాదిస్తున్నారు.

**ఎందుకు తీసుకోలేదు...**

చంద్రబాబుపై కేసుకు 17ఏ వర్తిస్తుందా, లేదా అనే విషయం పక్కనపెడితే... అసలు గవర్నర్ అనుమతి తీసుకుంటే పోయేదేముంది? ఎందుకు తీసుకోలేదు? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లోలాగా ఏపీలో రాష్ట్ర ప్రభుత్వానికీ–రాజ్‌భవన్‌కూ మధ్య యుద్ధ వాతావరణమేం లేదు. అవసరమైతే గవర్నర్లు న్యాయ నిపుణుల సలహా తీసుకుంటారు. స్థానికంగా అడ్వొకేట్ జనరల్‌తో లేదా తనకు పరిచయమున్న వారితో చర్చిస్తారు. గత గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఢిల్లీలో తనకున్న న్యాయవాదులతో చర్చించే వారు. అంతకుముందున్న గవర్నర్ కూడా ఇదే చేసేవారు. ఇప్పుడు కూడా ఇంకెవరైనా గవర్నర్‌గా ఉంటే, చంద్రబాబుపై కేసుకు ప్రభుత్వం అనుమతి కోరేదేమో! కానీ... ఇప్పుడు గవర్నర్‌గా ఉన్నది జస్టిస్ నజీర్ అహ్మద్. ఆయన మరొకరిని న్యాయ సలహా అడగాల్సిన అవసరం లేదు. ఆయనే స్వయంగా న్యాయ కోవిదుడు.

అవినీతి నిరోధక చట్టం సవరణ ద్వారా 2018 జూలైలో '17ఏ' అమలులోకి వచ్చింది. స్కిల్ స్కామ్ అంతకంటే ముందే జరిగింది కాబట్టి... చంద్రబాబుకు 17ఏ వర్తించదన్నది ప్రభుత్వ వాదన. నిజానికి... అంతకంటే ముందే ఈ కేసులో ప్రాథమిక విచారణ జరిగి, అందులో ఏమీ లేదని దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. 2017లో ఒక వ్యక్తి దీనిపై సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కావడంతో దీనిని సీబీఐ స్వీకరించలేదు. రాష్ట్ర ఏసీబీ పరిశీలనకు పంపించింది. 2018లో ఏసీబీకి మరో ఫిర్యాదు కూడా అందింది. అప్పటి ఏసీబీ డీజీ ఠాకూర్ ఈ అంశంపై రెగ్యులర్ విచారణకు ఆదేశించారు. రాష్ట్ర అధికారులు పుణెలోని జీఎస్టీ విభాగానికి లేఖ రాసి వివరాలు కోరారు. ఇందులో చెప్పుకోదగ్గ వివరాలేవీ లేవని సమాధానం వచ్చింది. ఏసీబీకే చెందిన మరో అధికారి అప్పటి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సాంబశివరావుకు లేఖ రాశారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని పూర్తి వివరాలతో ఆయన సమాధానం ఇచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక... పాత ప్రభుత్వం చేసిన అన్ని నిర్ణయాలపై సమీక్షకు 'సిట్' నియమించింది. దీనిపై హైకోర్టు స్టే విధించడంతో... స్కిల్ డెవలప్‌మెంట్ కేసును తాజాగా నమోదు చేశారు. నిజానికి... 2018లోనే ఏసీబీ దీనిపై ప్రాథమిక విచారణ జరిపింది. ఒకవేళ ఇప్పుడు ఏసీబీ అధికారులు దీనిపై విచారణ జరపాలనుకుంటే, పాత కేసునే రీఓపెన్ చేయాలి. కానీ... 2019లో 'ఆరా'లు మొదలుపెట్టి, 2021లో కొత్తగా కేసు నమోదు చేశారు. అలా చూసుకున్నా.. చంద్రబాబుపై కేసు పెట్టేందుకు 17ఏ కింద గవర్నర్ అనుమతి తీసుకోక తప్పదు. వ్యక్తిగత, రాజకీయ కక్షలతో గత పాలకులను, అధికారులను రోడ్డుకీడ్చుతున్నారనే '17ఏ' ద్వారా రక్షణ కల్పించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై చంద్రబాబు ఏ నిర్ణయాలనైనా 'పబ్లిక్ సర్వెంట్' హోదాలో, అధికారికంగానే తీసుకున్నారు. అసలు విషయం ఏమిటంటే... గతనెల 9వ తేదీన చంద్రబాబును అరెస్టు చేసేదాకా ఈ కేసులో ఆయన నిందితుడే కాదు. ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు లేదు. 17ఏపై 2021 సెప్టెంబరులోనే కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం (డీవోపీటీ) అన్ని రాష్ట్రాలకు స్పష్టంగా లేఖ రాసింది. ఇందులో... 'నేరం' ఈ సవరణ అమలులోకి రాకముందు జరిగిందా, తర్వాత జరిగిందా అనే ప్రస్తావనే లేదు. 'పబ్లిక్ సర్వెంట్స్' తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత అథారిటీ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే కేసు పెట్టాలని స్పష్టంగా చెప్పింది. ఏ స్థాయి వ్యక్తి విషయంలో ఎవరి పర్మిషన్ తీసుకోవాలనే నియమావళిని కూడా నిర్దేశించింది. దీని ప్రకారం... చంద్రబాబుపై కేసు పెట్టాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి.

# అసాంఘిక కార్యకలాపాల నివారణకే సరిహద్దులో పకడ్బందీ చర్యలు.

**జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**

**చెక్ పోస్టును ప్రారంభించిన జిల్లా ఎస్పీ**

**సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ.**





**జగిత్యాల, సమ సమాజం:** అసాంఘిక కార్యకలాపాల నివారణకే జిల్లా సరిహద్దులో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జగిత్యాల జిల్లా నుండి మూడు జిల్లాల కు అనుసంధానంగా ఉండే ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపట్నం కూడలి వద్ద నూతనంగా నిర్మించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోలీస్ బోర్డర్ చెక్ పోస్ట్, కమాండ్ కంట్రోల్ ను శనివారం జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల సందర్భంగా జిల్లాలోని చుట్టూ ఉన్న అన్ని బార్డర్ల లో చెక్ పోస్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో భాగంగానే ఈరోజు నూతనంగా నిర్మించిన రాయపట్నం చెక్ పోస్ట్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. రాత్రి పగలు ఇతర జిల్లాల నుండి వచ్చే ,వెళ్లే వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. డబ్బు మద్యం రవాణా జరగకుండా నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అన్నారు. ఈ చెక్ పోస్ట్ కరీంనగర్ జగిత్యాల మంచిర్యాల మూడు జిల్లాలకు సరిహద్దు కావడంతో ఈ ప్రాంతం నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుందని గతంలో ఇక్కడ తాత్కాలికంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీ లు నిర్వహించేవారని అయితే రానున్న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రెండు ప్రత్యేక గదులతో మరొక సపోర్ట్ రూమ్ నిర్మించడం జరిగిందని ఇందులో సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహిస్తారని వచ్చి పోయే వాహనాలను, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు సుమారు మూడు లక్షల వ్యయంతో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేయడం జరిగిందని కావున ఈ ప్రాంతంలో జరిగే ప్రతి సంఘటన కమాండ్ కంట్రోల్ ద్వారా చూడవచ్చున్నారు. ప్రమాదాల నివారణకు వాహనాలు వేగాన్ని అదుపులో ఉంచేందుకు రోడ్డు మధ్యలో భారీ ఎత్తున బారికెట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎలక్షన్ ల సమయంలో ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ అన్ని రకాల ఏర్పట్లు చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు, యువత ఎలక్షన్ సమయం లో ఎలాంటి గొడవలకు పోకుండా పోలీసువారికి సహకరించాలని ఈసందర్భంగా ఎస్పీ సూచించారు. ఈ చెక్ పోస్ట్ నిర్మాణానికి సహకరించిన స్థానిక ప్రజలకు ,దాతలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీ భాస్కర్ పోలీస్ చెక్ పోస్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకట స్వామి సి.ఐ రమణమూర్తి, ఎస్సైలు దత్తాత్రి, నరేశ్ , సందీప్, రామక్రిష్ణ, శ్వేత, సర్పంచ్ ఈర్ల చిన్నక్క, ఎంపిటిసి పుష్పలత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణ నిబంధనలు, నియమావళిని ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలి.



**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**




**జగిత్యాల, సమ సమాజం:** ఎన్నికల కమీషన్ నిబంధనలను శిక్షణ కార్యక్రమంలో ఆయా అధికారులకు, సిబ్బందికి వివరించారని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, నియమావళిని ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. శనివారం రోజున ఐ డి ఓ సి (ఇంటిగ్రెటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ )సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఎన్నికల కమీషన్ ఆయా జిల్లా ఎన్నికల అధికారులకు ఇటీవల సమావేశం నిర్వహించి సమీక్షించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. శిక్షణ కార్యక్రమాలలో వివరించిన అంశాలను నియోజకవర్గాలలో జరిగే శిక్షణ తరగతులలో ఆయా టీం లకు పూర్తీ వివరాలతో వివరించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా నిర్వహించే విధంగా ఎన్నికల యంత్రాంగాన్ని సమాయాత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను వివరిస్తామని తెలిపారు. శిక్షణ తరగతుల సమయంలో అందించిన రూల్స్, ఇతర అంశాలకు సంబంధించిన పుస్తకాలను అందించడం జరుగుతుందని, వాటిని తప్పనిసరిగా పఠనం చేసి సిద్దంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. తిరుపతి, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఎం.పి.డి.ఓ.లు, కే. నవీన్ కుమార్, డి. సంతోష కుమార్, అసెంబ్లి నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉద్యమంలా సానిటేషన్ పనులు జరగాలి

**జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత**





**జగిత్యాల,సమ సమాజం:** జిల్లాలో ఉద్యమంలా సానిటేషన్ పనులు జరగాలని జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్పర్సన్ దావ వసంత అధ్యక్షతన శనివారం అధికారులతో సీజనల్ వ్యాధులు,శానిటేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా హెల్త్, శానిటేషన్ విభాగాలు కలిసి పని చేస్తూ ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను మరింత శ్రద్ధతో చేయాలని సూచించారు. పారిశుధ్యానికి, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇచ్చే కార్యక్రమాలను చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. దోమల నివారణకు సంబంధించి ఫాగింగ్, యాంటీ లార్వాల్ వంటి కార్యక్రమాలను చేయాలని అన్నారు. ప్రతి పల్లె పచ్చగా,పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని హరితహారం, స్వచ్ఛ సర్వేక్షన్, పరిశుభ్రత వంటి కార్యక్రమాల వల్ల పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి నీరు అందించాలని అన్నారు. ప్రజల ఆరోగ్యమే సీఎం ఆకాంక్ష, దానికి అనుగుణంగా ప్రతి మండలాల్లో, గ్రామాల్లో శానిటేషన్, మొక్కల సంరక్షణ కార్యక్రమాలు నిరంతరం జరగాలి అని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేష్ డిప్యూటీ సీఈవో రఘువరన్, డిఎంహెచ్ఓ పుప్పాల శ్రీధర్,డీపీవో దేవరాజ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్ , ప్రోగ్రాం ఆఫీసర్ జైపల్ రెడ్డి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం బతుకమ్మ

**మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి**

**బతికేపల్లిలో బతుకమ్మ పాట చిత్రీకరణ**



**జగిత్యాల,సమ సమాజం:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ పండుగ అని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, పెగడపల్లి మండలం బతికేపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి అన్నారు. శనివారం బతికేపల్లిలో పన్నెల క్రియేషన్స్ యూట్యూబ్ ఛానెల్ ఆధ్వర్యంలో బతుకమ్మ పాట చిత్రికరించగా సర్పంచ్ శోభారాణి క్లాప్ కొట్టారు. ఈసందర్భంగా శోభారాణి అడపడుచులు ఎంగిలి పూల బతుకమ్మతో మొదలు పెట్టి రోజుకో తీరు బతుకమ్మలు పేర్చి తొమ్మిది రోజులు రాత్రి వేళల్లో యువతులు, మహిళలు ఆడి పాడుతూ సంబరంగా జరుపుకుంటారని బతుకమ్మ గురించి వివరించారు. తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ పేరిట తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను గ్రామ, పట్టణ కూడల్లలో పెట్టి మహిళలు ఆడుతూ,జానపద పాటలు పాడి తొమ్మిది రోజుల వేడుకల అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి సత్తుపిండి వాయినాలు ఇచ్చిపుచ్చుకుని సంబరంగా ఇంటిల్లిపాది జరుపుకునే పండుగ బతుకమ్మ అని శోభారాణి పేర్కొన్నారు. అటువంటి విశిష్టత కలిగిన బతుకమ్మ పాట చిత్రికరణ మా గ్రామంలో చేయడం చాలా సంతోషకరమని చెబుతూ యూట్యూబ్ ఛానెల్ బృందాన్ని సర్పంచ్ అభినందించారు. రాజ్ లెక్కల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాటకు కెమెరామెన్ రామ్ గడుతూరి, కోరియో గ్రఫీ పవన్, విజయ్, ప్రొడక్షన్ ఎగ్జక్యూటివ్ ప్రీతి చౌదరి, అసిస్టెంట్ దర్శకులు కౌశిక్, వంశీ, మనిదీప్, శివ ఆర్ల, సింగర్ జార్జియ జానపదా జనార్ధన్ ల సారథ్యంలో రూపుదిద్దుకుంటుంది. పాట చిత్రికరణ కార్యక్రమంలో స్థానికులు కమాటం మల్లయ్య, బత్తిని శేఖర్ గౌడ్, బాలుసాని శ్రీనివాస్ గౌడ్, తొంటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ ను ప్రారంభించి జెడ్పీ చైర్ పర్సన్



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జగిత్యాల రూరల్ మండలం నర్సింగపూర్ గ్రామంలో శనివారం జగిత్యాల జెడ్పి చైర్ పర్సన్ దావా వసంత సురేష్ ప్రారంభిచారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం సరోజన మలరెడ్డి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేష్ ఉప సర్పంచ్ కాంతమ్మ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాధర్ గ్రామ రైతు సమన్వయ సమితి నాయకులు తిరుపతి గౌడ్ మాజీ సర్పంచ్ నరేష్ మాజీ ఎంపీటీసీ కుడుకల లక్ష్మణ్,రాజన్నరసయ్య ఎంపిడిఒ రాజేశ్వరి యం పి ఓ రవి బాబు ఎపియం గంగాధర్ వార్డ్ మెంబెర్స్,మహిళలు నాయకులు యువకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న జడ్పీ చైర్పర్సన్



**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామ శివారులో నవదుర్గ సేవ సమితి అమ్మవారి దేవాలయం అమ్మవారిని శనివారం జగిత్యాల జడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ దర్శించుకున్నారు. అనంతరం విద్యుత్తు సరఫరా పనులు పూర్తి అవగా, శనివారం నాడు విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. అనంతరం నవదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్సంగ్ కార్యక్రమంలో జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్పర్సన్ మాట్లాడుతూ అమ్మ వారి దయ జిల్లా ప్రజలందరిపై ఉండాలన్నారు. వారి వెంట అర్బన్ జెడ్పీటీసీ మహేష్ సర్పంచ్ స్వప్న రాజేశ్వర్ రెడ్డి ఎంపీటీసీ శేకర్ రెడ్డి నాయకులు లక్ష్మణ్ , సత్యం, నవదుర్గ సేవ సమితి సభ్యులు శ్రీను,చంద్రయ్యు, మతాలు, భక్తులు నాయకులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్లు అందచేసిన ఎమ్మెల్యే...



**జగిత్యాల టౌన్/సమ సమాజం:** జగిత్యాల రూరల్ మండల అంతర్గం గ్రామ ఎస్సీ కాలనీ లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ జగిత్యాల జిల్లా, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది మహిళలకు కుట్టు మిషన్ లను, సర్టిఫికెట్ లను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏ యం సి ఛైర్మెన్ రాధ రవీందర్ రెడ్డి,సర్పంచ్ లు నారాయణ,రాజమణి గంగాధర్,ఎంపీటీసీ శ్రీనివాస్, వైస్ చైర్మన్ అసిఫ్,ఉప సర్పంచ్ నోముల శేఖర్ రెడ్డి, మండల అధికార ప్రతినిధి సురేష్ , నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం నిలువ చేస్తే కఠిన చర్యలు

**ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీధర్**



**జగిత్యాల, సమ సమాజం:** ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇండ్లలో సామర్థ్యానికి మించి మద్యం నిలువ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీధర్ హెచ్చరించారు. శనివారం ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గుడుంబా పై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. గుడుంబా తయారీ కోసం వినియోగించే బెల్లం, స్పటిక, నాగస్వరం బిళ్ళలు, జీడీ గింజలు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాల్లో విక్రయాలపై విజిలెన్స్ టీం ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ పేర్కొన్నారు.

## జాగృతి ఆధ్వర్యంలో కొల్లూరు లో బతుకమ్మ చీరల పంపిణీ

**ఆలేరు అక్టోబర్ 7 : సమ సమాజం:** ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ బతుకమ్మల చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ కోటగిరి జయమ్మ కొల్లూరు గ్రామ మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ చేసినారు. సర్పంచి కోటగిరి జయమ్మ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో మహిళల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ ఇస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలు ఇంకా అనేక సంక్షేమ పథకాలు అందుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో కొల్లూరు ఎంపీటీసీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య, వెంకటేశ్ యాదవ్, కొల్లూరు గ్రామ ఉపసర్పంచ్ గ్యాదపాక మహేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శి వలిగొండ మల్లేష్, అంగన్వాడీ టీచర్ జనగాం సుధారెడ్డి, సమ భావన సంఘం అకౌంటెంట్ కొంతం రజిత, వార్డు సభ్యులు చెవ్వ స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ సీత మహేష్, మహిళా సంఘం నాయకురాలు, గ్యాదపాక శోభ, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జయహో భారత్ 107



'వంద' పతకాల లక్ష్యంతో చైనా గడ్డపై ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత క్రీడా బృందం అనుకున్నది సాధించింది. శనివారంతో భారత క్రీడాకారుల ఈవెంట్స్ అన్నీ ముగిశాయి. చివరిరోజు భారత్ ఆరు స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలతో మెరిసి ఏకంగా 12 పతకాలు సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో తొలిసారి 'పతకాల సెంచరీ' మైలురాయిని దాటింది. అంతేకాకుండా ఈ క్రీడల చరిత్రలోనే 107 పతకాలతో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది.

అంతర్జాతీయ క్రీడల్లో భారత్‌కిదే గొప్ప ప్రదర్శన కావడం విశేషం. 2010లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ 101 పతకాలు సాధించింది. ఈ ప్రదర్శనను భారత్ అధిగమించింది. శనివారం భారత్‌కు ఆర్చరీలో రెండు స్వర్ణాలు.. కబడ్డీల్లో రెండు పసిడి పతకాలు... పురుషుల టి20 క్రికెట్‌లో, పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఒక్కో బంగారు పతకం లభించాయి. ఆదివారం కేవలం కరాటే, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ ఈవెంట్స్ జరగనున్నాయి. అనంతరం సాయంత్రం ముగింపు వేడుకలతో హాంగ్జౌ ఆసియా క్రీడలకు తెరపడుతుంది.

హాంగ్జౌ: చైనా గడ్డపై భారత్ తమ పతకాల వేటను దిగ్విజయంగా ముగించింది. ఆసియా క్రీడల్లో ఎవరూ ఊహించని విధంగా 107 పతకాలతో అదరగొట్టింది. ఇందులో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి. తమ పోటీల చివరిరోజు భారత్ 12 పతకాలు గెలిచి పతకాల పట్టికలో నాలుగో స్థానాన్ని ఖరారు చేసుకుంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత్ 16 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలతో కలిపి 70 పతకాలతో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

### సురేఖ, ఓజస్ 'స్వర్ణ' చరిత్ర

శనివారం ముందుగా ఆర్చరీలో భారత్ బాణం 'బంగారు' లక్ష్యాన్ని ఛేదించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణం గెలిచింది. ఫైనల్లో జ్యోతి సురేఖ 149%--%145తో చేవన్ సో (దక్షిణ కొరియా)ను ఓడించింది. జ్యోతి సురేఖ 15 బాణాలు సంధించగా అందులో 14 పది పాయింట్ల లక్ష్యంలో... ఒకటి 9 పాయింట్ల లక్ష్యంలో దూసుకెళ్లడం విశేషం. ఓవరాల్‌గా జ్యోతి సురేఖకు ఈ ఆసియా క్రీడలు చిరస్మరణీయమయ్యాయి. ఈ క్రీడల్లో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ 3 స్వర్ణాలు సాధించింది. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌తోపాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లోనూ సురేఖ బంగారు పతకాలు గెలిచంది. తద్వారా దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష (1986 సియోల్ గేమ్స్‌బీ 4 స్వర్ణాలు, 1 రజతం) తర్వాత ఒకే ఆసియా క్రీడల్లో కనీసం 3 స్వర్ణ పతకాలు గెలిచిన భారతీయ క్రీడాకారిణిగా జ్యోతి సురేఖ గుర్తింపు పొందింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతకం కూడా భారత్ ఖాతాలోనే చేరింది. ప్రపంచ చాంపియన్ అదితి స్వామి (భారత్) 146%--%140తో ఫాదిలి జిలిజాటి (ఇండోనేసియా)పై గెలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కే లభించాయి. ఫైనల్లో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే 149%--%147తో అభిషేక్ వర్మ (భారత్)పై గెలిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ క్రీడల్లో ఓజస్‌కిది మూడో స్వర్ణం. పురుషుల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ విభాగంలో ఓజస్ పసిడి పతకాలు గెలిచాడు.

### సాత్విక్-చిరాగ్ జోడీ అద్భుతం

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు 'పసిడి' కల నెరవేరింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ చాంపియన్‌గా అవతరించి ఈ క్రీడల చరిత్రలో భారత్‌కు తొలిసారి బంగారు పతకాన్ని అందించింది. శనివారం జరిగిన ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-16తో చోయ్ సోల్‌గు-కిమ్ వన్‌హో (దక్షిణ కొరియా) జంటను ఓడించింది.

సెమీస్‌లో మలేసియాకు చెందిన ప్రపంచ మాజీ చాంపియన్ జోడీని బోల్తా కొట్టించిన భారత జంట తుది పోరులోనూ దూకుడుగా ఆడింది. కళ్లు చెదిరే స్మాష్‌లతో, చక్కటి డిఫెన్స్‌తో కొరియా జోడీకి కోలుకునే అవకాశం ఇవ్వకుండా విజయాన్ని దక్కించుకుంది. 1982 ఆసియా క్రీడల్లో లెరాయ్-ప్రదీప్ గాంధే భారత్‌కు పురుషుల డబుల్స్‌లో కాంస్య పతకాన్ని అందించారు. ఆసియా క్రీడల్లో విజేతగా నిలవడంతో వచ్చే వారం విడుదల చేసే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి సాత్విక్%--%చిరాగ్ జోడీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనుంది.

### దీపక్ 'రజత' పట్టు

ఆసియా క్రీడల పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ ఈవెంట్‌ను భారత్ రజత పతకంతో ముగించింది. 86 కేజీల విభాగంలో దీపక్ పూనియా భారత్‌కు రజత పతకాన్ని అందించాడు. ఇరాన్ దిగ్గజ రెజ్లర్ హసన్ యజ్దానితో జరిగిన ఫైనల్లో దీపక్ 3 నిమిషాల 31 సెకన్లలో 0-10తో 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో ఓడిపోయాడు.

రెజ్లింగ్ నిబంధనల ప్రకారం బౌట్‌లో పది పాయింట్ల ఆధిక్యం సాధించిన వెంటనే ఆ రెజ్లర్‌ను విజేతగా ప్రకటిస్తారు. అంతకుముందు దీపక్ తొలి రౌండ్‌లో 3%--%2తో షరిపోవ్ (ఖతర్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 11%--%0తో రియాన్‌డెస్టా (ఇండోనేసియా)పై, క్వార్టర్ ఫైనల్లో 7%--%3తో షోటా సిరాయ్ (జపాన్)పై, సెమీఫైనల్లో 4%--%3తో షపియెవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన యశ్ (74 కేజీలు), విక్కీ (97 కేజీలు), సుమిత్ మలిక్ (125 కేజీలు) ఆరంభ రౌండ్‌లలోనే ఓడిపోయారు.

### భారత జట్ల 'పసిడి' కూత

గత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలను చేజార్చుకున్న భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు ఈసారి తమ ఖాతాలోకి వేసుకున్నాయి. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 33%--%29తో డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్ జట్టును ఓడించగా... భారత మహిళల జట్టు 26%--%25తో చైనీస్ తైపీపై విజయం సాధించింది. ఆసియా క్రీడల కబడ్డీ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు ఎనిమిదోసారి స్వర్ణ పతకం నెగ్గగా... మహిళల జట్టు మూడోసారి పసిడి పతకం సాధించింది.

### చెస్‌లో డబుల్ ధమాకా

వ్యక్తిగత విభాగంలో త్రుటిలో పతకాలు కోల్పోయిన భారత చెస్ క్రీడాకారులు టీమ్ ఈవెంట్‌లో సత్తా చాటుకొని రజత పతకాలు నెగ్గారు. పెంటేల హరికృష్ణ, ఇరిగేశి అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్‌లతో కూడిన భారత పురుషుల జట్టు నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత 15 మ్యాచ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్‌తో జరిగిన చివరి రౌండ్‌లో భారత్ 3.5-0.5తో గెలిచింది. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీలతో కూడిన భారత మహిళల జట్టు కూడా 15 మ్యాచ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో భారత్ 4-0తో దక్షిణ కొరియాను ఓడించింది.

### క్రికెట్‌లో కనకం...

తొలిసారి ఆసియా క్రీడల క్రికెట్ ఈవెంట్‌లో పోటీపడ్డ భారత క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. టి20 ఫార్మాట్‌లో జరిగిన ఈ పోటీల్లో శనివారం భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. అఫ్గానిస్తాన్ 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసిన దశలో వచ్చిన వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. మెరుగైన ర్యాంక్ కారణంగా భారత్‌ను విజేతగా ప్రకటించి స్వర్ణ పతకాన్ని అందించగా... అఫ్గానిస్తాన్ జట్టుకు రజతం లభించింది. స్వర్ణం నెగ్గిన భారత జట్టులో హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు.

# విజయీభవ!



- ప్రపంచకప్‌లో భారత్ తొలిపోరు
- నేడు ఆస్ట్రేలియా, టీమిండియా ఢీ
- మధ్యాహ్నం 2 నుంచి..

చెన్నై: వన్డే ప్రపంచకప్ వేట ప్రారంభించేందుకు టీమ్ఇండియా రెడీ అయింది. ఇటీవల ఆసియా కప్ చేజిక్కించుకున్న భారత్.. అదే జోరుతో వరల్డ్‌కప్‌లోనూ శుభారంభం చేసేందుకు సమాయత్తమైంది. ఆదివారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. పుష్కర కాలం తర్వాత భారత్‌లో జరుగుతున్న మెగాటోర్నీ కోసం రోహిత్ సేన అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటే.. వరల్డ్‌కప్ అనే మాట వింటే చాలు పూనకం వచ్చినట్లు రెచ్చిపోయే కంగారూలు సమరానికి సై అంటున్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ప్రపంచకప్‌లో ప్రతీ పోరు ప్రధానమైనదే కావడంతో ఈ మ్యాచ్ ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటీవల స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో కంగారూలపై టీమ్ఇండియా విజయం సాధించడం.. రోహిత్‌సేన మనోబలాన్ని పెంచే అంశం కాగా.. దానికి బదులు తీర్చుకోవాలని ఆసీస్ కృతనిశ్చయంతో ఉంది. విశ్లేషకులు ఈ మ్యాచ్‌ను భారత్ బ్యాటింగ్ బలానికి ఆసీస్ పేస్ దళానికి మధ్య సమరంగా అభివర్ణిస్తుండటంతో.. మన బ్యాటర్లపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డెంగ్యూ బారిన పడిన యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు రోహిత్ వెల్లడించడాన్ని బట్టి చూస్తే.. అతడు ఆదివారం పోరుకు అందుబాటులో ఉండటం అనుమానమే! ఇదే నిజమైతే, హిట్‌మ్యాన్‌తో కలిసి ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు రానున్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ పేస్ భారం మోయనున్నారు. ఫుల్ ఫామ్‌లో ఉన్న మహమ్మద్ షమీకి నిరీక్షణ తప్పకపోవచ్చు. మరోవైపు అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో ఆస్ట్రేలియా సమతూకంగా కనిపిస్తున్నది. వార్నర్, మార్ష్, స్మిత్, లబుషేన్, గ్రీన్, కారీ, మ్యాక్స్‌వెల్‌తో ఆ జట్టు బ్యాటింగ్ శత్రుదుర్భేధ్యంగా కనిపిస్తున్నది.

### నిరీక్షణకు తెరదించేందుకు..

దశాబ్ద కాలంగా ఒక్క ఐసీసీ టోర్నీ కూడా గెలువని భారత జట్టు.. ఈ సారి ఆ కరువు తీర్చుకోవాలని తహతహలాడుతున్నది. 2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత్.. సేమ్ సీన్ రిపీట్ చేయాలనుకుంటున్నది. అప్పటి జట్టు నుంచి కోహ్లీ, అశ్విన్ మాత్రమే ప్రస్తుత టీమ్‌లో చోటు దక్కించుకోగా.. మిగిలిన వాళ్లంతా ప్రపంచ చాంపియన్ బిరుదు కోసం పరితపిస్తున్నారు. లీగ్ దశలో తొమ్మిది మ్యాచ్‌లను తొమ్మిది వేర్వేరు వేదికలపై ఆడనున్న టీమ్ఇండియా.. చెన్నై నుంచి సమరశంఖం పూరించాలని మనమూ కోరుకుందాం! టీమిండియా ఆల్ ది బెస్ట్!! 2019 వన్డే ప్రపంచకప్ అనంతరం భారత్, ఆస్ట్రేలియా మధ్య 12 వన్డేలు జరగగా.. ఇరు జట్లు చేరో ఆరు విజయాలు నమోదు చేసుకున్నాయి.



## కేర్చిపల్లి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ

**అక్టోబర్ 7 పృధ్వి ప్రతినిధి యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మండల పరిధిలోని కేర్చిపల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ మద్దెల మంజుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు గ్రామంలోని ఆడపడుచులకు చీరల పంపిణీ చేశారు ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ చీరలు తీసుకున్నారు అనంతరం సర్పంచ్ మద్దెలమంజుల మాట్లాడుతూ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి భువనగిరి నియోజకవర్గం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అంతేకాకుండా తన సొంత నిధులతో గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే అని అన్నారు అదేవిధంగా ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కి భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కి సర్పంచ్ మద్దెల మంజుల గ్రామ ప్రజలు మహిళలు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎమ్మె వెంకటేశం వార్డు మెంబర్లు గ్రామ శాఖ అధ్యక్షులు సత్తిరెడ్డి పంచాయతీ కార్యదర్శి స్వప్న మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## భువనగిరి అభివృధి ప్రదాత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి గారి సహకారంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ నరాల నిర్మల-వెంకటస్వామి యాదవ్



**అక్టోబర్ 6 పృథ్వి ప్రతినిధి యాదాద్రి :** మండలంలోని నమాత్ పల్లి,అనాజిపురం గ్రామంలో శనివారం భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల-వెంకటస్వామి యాదవ్ గారు.15వ ఆర్థిక సంఘం నిధులు ఐదు లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య,గ్రామ సర్పంచ్ లు ఎదునూరి ప్రేమలత-మల్లేశం,ఏల్లంల శాలిని-జంగయ్య యాదవ్,ఎంపీటీసీ మట్ట పారిజాత-శంకర్ బాబు,గునుగుంట్ల-కల్పన శ్రీనివాస్,ఉప సర్పంచ్ మైలారం వెంకటేష్,వార్డ్ మెంబర్లు బత్తిని నరేష్,జిట్టా అనిత-అశోక్ రెడ్డి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సఫారీల శతక గర్జన

**డికాక్, డస్సెన్, మార్క్రమ్ సెంచరీలు**

**49 బంతుల్లోనే మార్క్రమ్ సెంచరీ**

**ఒకే మ్యాచ్‌లో మూడు సెంచరీలు తొలిసారి**

**వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా 428/5**

**శ్రీలంకతో మ్యాచ్‌లో రికార్డుల మోత**

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా దక్షిణాఫ్రికా చరిత్రకెక్కింది. బాదుడే పరమావధిగా బరిలోకి దిగిన సఫారీ ఆటగాళ్లు విశ్వరూపం కనబర్చడంతో శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 102 పరుగుల తేడాతో శ్రీలంకపై జయభేరి మోగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 428 పరుగులు చేసింది. 1975 నుంచి ప్రారంభమైన మెగాటోర్నీ చరిత్రలో ఒక జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే కావడం విశేషం. ఓపెనర్ క్వింటన్ డికాక్ (84 బంతుల్లో 100బీ 12 ఫోర్లు, 3 సిక్సర్లు), డసెన్ (110 బంతుల్లో 108బీ 13 ఫోర్లు, 2 సిక్సర్లు), మార్క్రమ్ (54 బంతుల్లో 106బీ 14 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో లంకేయులను చీల్చిచెండాడారు. ఆఖర్లో క్లాసెన్ (32బీ ఒక ఫోర్, 3 సిక్సర్లు), మిల్లర్ (39 నాటౌట్‌బీ 3 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా విజృంభించడంతో సఫారీ జట్టు రికార్డు స్కోరు చేయగలిగింది. లంక బౌలర్లలో మధుషనక రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో లంక 44.5 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. అసలంక (64 బంతుల్లో 79బీ 8 ఫోర్లు, 4 సిక్సర్లు), కుషాల్ మెండిస్ (42 బంతుల్లో 76బీ 4 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ దసున్ షనక (62 బంతుల్లో 68బీ 6 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ మూడు, జాన్‌సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబాడ తలా 2 వికెట్లు పడగొట్టారు.




### సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 428/5 (డసెన్ 108, మార్క్రమ్ 106బీ మధుషనక 2/86),

శ్రీలంక: 44.5 ఓవర్లలో 326 ఆలౌట్ (అసలంక 79, కుషాల్ మెండిస్ 76బీ రబాడ గెరాల్డ్ 3/68, రబడ 2/50)

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in